‘ఉపాధి’ ఊతం



రాజాం: కంచరాంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కూలీల వలసల నివారణే లక్ష్యంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు గ్రామీణులకు ఉపాధి ఊతమిస్తున్నాయి. వ్యవసాయ పనులు లేని సమయంలో దొరికే ఈ పనులను గ్రామాల్లోని కూలీలంతా సద్వినియోగం చేసుకుంటున్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 వరకు వేతనం గిట్టుబాటు అవుతుండడంతో జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరూ పనులకు ఉపక్రమిస్తున్నారు. వారానికోసారి కూలి డబ్బులు సైతం బ్యాంకు ఖాతాల్లో పక్కాగా జమ అవుతున్నాయి. దీంతో ఏ పనులూ లేని సమయంలో ఉపాధి పనులే తమకు తిండి పెడుతున్నాయని వేతనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్‌.



రేగిడి: వన్నలిలో మద్దువలస ప్రాజెక్ట్ పిల్లకాలువలో ఉపాధి పనులు చేస్తున్న దృశ్యం



తెర్లాంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద వేసిన టెంట్లు



సంతకవిటి: మిర్తివలసలో ఉపాధి పనుల్లో వేతనదారులు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



బాడంగి: మాట్లాడుతున్న ఎంఈవో రాజేశ్వరి

బాడంగి: బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో–2 ఎం.రాజేశ్వరి కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద విలేకరులతో మంగళవారం మాట్లాడిన ఆమె.. ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, విద్యాసామగ్రి, మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించారు. నైపుణ్యం, అనుభవం కలిగిన బోధనా సిబ్బంది ఉన్నారని, పిల్లల బంగారు భవిష్యత్ ప్రభుత్వ పాఠశాలలతోనే సాధ్యమన్నారు. తల్లిదండ్రులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా పిల్లలను దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.



రేగిడి: కాగితాపల్లిలో డ్రాపౌట్ విద్యార్థులను బడిలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

రేగిడి: చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని, ప్రతిఒక్కరూ చదువుకోవాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని కాగితాపల్లి, పారంపేట, ఉనుకూరు తదితర గ్రామాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో డ్రాపౌట్ విద్యార్థులు(బడి మధ్యలో మానేసిన వారు)ను బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సంతకవిటి:

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎఫ్ఏ రేఖ ప్రకృతి సేద్యం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు వేసుకుని, అవి మొక్కలైన తర్వాత అదే నేలలో కలియదున్నుకోవాలన్నారు. తద్వారా నేల సారవంతం కావడంతో పాటు పంటలు బాగా పండుతాయన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గి, పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. అనంతరం నవధాన్యాల తయారీని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మామిడిపల్లి యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ, ఐసీఆర్‌పీవోలు తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాల తయారీని వివరిస్తున్న ఎన్‌ఎఫ్ఏ రేఖ

వరి విత్తనాలు సిద్ధం



వరి విత్తనాలు పరిశీలిస్తున్న ఏవో వెంకటయ్య

రామభద్రపురం: మండలంలోని అన్ని ఆర్‌బీకేలలో వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో వెంకటయ్య అన్నారు. స్థానిక ఆర్‌బీకే–2లో సిద్ధంగా ఉన్న వరి విత్తనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు అవసరమైన 750 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేశామన్నారు. ఎంటీయూ 1121, ఎంటీయూ 1064, సోనామసూరి, సాంబమసూరి, ఆర్‌జేఎల్ విత్తనాలతో పాటు ఎంటీయూ 1224, ఎంటీయూ 1518 కొత్తరకం వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆర్‌బీకేలలో 150 మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్‌లో 450 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. మరో 60 మెట్రిక్ టన్నులు రానుందన్నారు. 60.8 క్వింటాళ్ల కట్టిజనుము, పిల్లిపెసర, జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. నిషేధిత ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే షాపుల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



నవధాన్యాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయం ఎన్‌ఎఫ్ఏ రేఖ అన్నారు. మండలంలోని పొగిరి గ్రామంలో నవధాన్యాల సాగు–వాటి ప్రయోజనాలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాలు పొలాల్లో వేసుకుని, మొక్కలైన తర్వాత వాటిని నేలలో కలియదున్నాలన్నారు. తద్వారా భూసారం పెరిగి పంటలు బాగా పండుతాయన్నారు.
పంటకు అవసరమైన పోషకాలు అందుతాయని, తెగుళ్లు, చీడపీడల బారినపడకుండా పంట ఉంటుందన్నారు. కార్యక్రమంలో పొగిరి యూనిట్ ఎల్1 రమాదేవి, ఐసీఆర్‌పీలు వై.నిర్మల, టి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



వావిలవలసలో డ్వాక్రా గ్రూపు మహిళలతో సమావేశమైన ఏపీఎం గోవిందరావు

రేగిడి: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం బి.గోవిందరావు డ్వాక్రా సంఘాల మహిళలకు సూచించారు. మండలంలోని వావిలవలస, చినలింగాలవలస, పెదలింగాలవలస, వావిలవలస, తోకలవలస గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల మహిళలతో మంగళవారం సమావేశమైన ఆయన.. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా ప్రతినెలా చెల్లించాలని తెలిపారు. అందరూ రుణాలు చెల్లిస్తేనే వేరొకరికి రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు.

గృహనిర్మాణాల పరిశీలన

రాజాం: మండలంలోని గడిముడిదాం, గురవాం గ్రామాల్లోని ప్రభుత్వ గృహ నిర్మాణాలను ఎన్‌ఆర్ ఈజీఎస్ ఏపీవో సాయిరాం మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారునికి 90 రోజుల పనిదినాలు కల్పించామని, ఈ పనుల వినియోగంపై ఆరాతీస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే లబ్ధిదారుల వద్దకు చేరుకుని, ఉపాధి పథకం పనుల ద్వారా ఇచ్చిన నిధులపై ఆరాతీశారు. ఒక్కో ఇంటికి రూ.27 వేలు మేర లబ్ధి చేకూరిందని లబ్ధిదారులు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదం ఆరోగ్యానికి శ్రేయస్కరం



రేగిడి: ఆయుర్వేద మందులు అందుకున్న వారితో వైద్యాధికారి సునీల్‌కుమార్



రామభద్రపురం ఆయుర్వేద ఆస్పత్రిలో రోగి ఆరోగ్యం పరీక్షిస్తున్న వైద్యాధికారిణి ఉమాదేవి

రేగిడి: ఆయుర్వేద వైద్యం ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శిబిరానికి హాజరైన వారికి ఆయన వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆయుర్వేద వైద్యంలోని అద్భుతాలను వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే శక్తి ఆయుర్వేదానికి ఉందని, ప్రతిఒక్కరూ ఆయుర్వేద మందులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ప్రసాద్, చక్రధర్, సింహాచలం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.
రామభద్రపురం: ఆయుర్వేద ఆస్పత్రుల్లో మందులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యాధికారిణి ఎస్.ఉమాదేవి కోరారు. మంగళవారం స్థానిక ఆయుర్వేద ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్యసేవలు అందించిన ఆమె.. దగ్గు, చర్మవ్యాధులు, తెల్లబట్ట, కీళ్లనొప్పులు, వాతం, ఎనీమియా, గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్నిరకాల వ్యాధుల నివారణకు ఆయుర్వేద మందులు ఉన్నాయని, ఇప్పుడిప్పుడే మళ్లీ ఆయుర్వేదానికి ఆదరణ లభిస్తుండడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇంగ్లిష్ మందులు మాదిరి ఆయుర్వేద మందుల వల్ల ఒక్కసారిగా రోగాలు తగ్గవని, క్రమక్రమంగా తగ్గుతాయన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద మందులు వాడడమే ఆరోగ్యానికి మంచిదన్నారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

మెంటాడ: ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులు విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో కె.గోపీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని మొత్తం 19 రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు పంపించాలని ప్రతిపాదనలు పంపామన్నారు. ఎంటీయూ 1064, ఎంటీయూ 1121, ఆర్‌ఎన్‌ఆర్ 15048, ఎంటీయూ 1061, బీపీటీ 3291, బీపీటీ 5204, ఎంటీయూ 1318, ఎంటీయూ 7029 రకాల విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశామన్నారు. విత్తనాలు ఆర్‌బీకేలకు చేరగానే పేర్లు నమోదు చేసుకున్న రైతులకు తొలుత ఇస్తామన్నారు.

ఏపీఈఏపీసెట్‌లో బొబ్బిలి విద్యార్థుల ప్రతిభ



వరుణ్‌కుమార్



సీహెచ్ పావని

బొబ్బిలి: ఏపీఈఏపీసెట్‌లో బొబ్బిలి విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణంలోని వాసు జూనియర్ కళాశాలలో చదువుతున్న వి.వరుణ్ కుమార్ ఇంజినీరింగ్ విభాగంలో 3,458 ర్యాంకు, సీహెచ్ పావని 5,524వ ర్యాంకు సాధించారు. వీరిని కళాశాల సిబ్బంది అభినందించారు.

నవధాన్యాల విత్తనాల పంపిణీ



నవధాన్యాల విత్తనాలు అందిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస రైతు భరోసా కేంద్రం వద్ద పలువురు రైతులకు నవధాన్యాల విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రకాష్ మాట్లాడుతూ ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు పొలంలో వేసుకుని, మొక్కలైన తర్వాత కలియదున్నాలన్నారు. దీంతో నేల సారవంతమై పంటలు బాగా పండుతాయన్నారు. ప్రధాన పంటకు అవసరమైన పోషకాలన్నీ నేల నుంచే లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, లక్ష్మి, వరప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. స్థానిక పట్టణంలో పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో శశిభూషణ్, వెంకటనాయుడు, బాలభాస్కరరావు, మల్లేశ్వరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు 34 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 96 మంది శిబిరానికి హాజరుకాగా, వారికి వైద్యపరీక్షలు చేసిన వైద్యులు 34 మందికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని గుర్తించారు. ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో వైద్యుడు బి.వివేక్‌వర్మ, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.
రాజాం సిటీ: మండల పరిధిలోని బొద్దాం గ్రామంలో ఉన్న సత్యసాయి మందిరం వద్ద మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి మొత్తం 87 మంది రోగులు హాజరైన కళ్లను తనిఖీ చేయించుకోగా, మొత్తం 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమైనట్లు వైద్యులు నిర్ధారించారు. వీరందరికీ ఉచితంగా శస్త్రచికిత్స చేసేందుకు శంకర్ ఐ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించామని క్యాంప్ కో–ఆర్డినేటర్ ఎం.సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు నిఖిత, ఆప్తాలమిక్ అధికారి రత్నంరాజు, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సత్యనారాయణ, క్యాంపు మేనేజర్ ఎస్ఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

• సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని, అందుకు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గ్రాజుచీపురుపల్లి వద్ద ఏర్పాటు చేసిన మున్సిపాలిటీకి చెందిన డంపింగ్‌యార్డును మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఘనవ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చట్టాలు, న్యాయపరమైన అంశాలు, ప్రభుత్వ విధానాలు అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘనవ్యర్థాల నిర్వహణ సవాలుతో కూడుకున్నదని, మున్సిపాలిటీలో చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజల సహకారం అవసరమన్నారు. ఘనవ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసి వినియోగించే పద్ధతి పూర్వీకుల నుంచే ఉందన్నారు. అప్పట్లో ప్రతీ ఇంట్లో ఉండే చెత్తను కంపోస్టుగా మార్చి ఎరువుగా వినియోగించే వారని, ఆ ప్రక్రియనే ప్రస్తుతం సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్(ఘనవ్యర్థాల నిర్వహణ) అంటున్నామన్నారు. ఘనవ్యర్థాలను సరైన పద్ధతిలో వినియోగించకపోతే పర్యావరణ కాలుష్యమవుతుందని, దీనివల్ల జనజీవనం అస్తవ్యస్తమవుతుందన్నారు. అంతకుముందు కంపోస్ట్ యార్డు ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాదరావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, జాయింట్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ అధ్యక్షులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు, మానవతా సంస్థ అధ్యక్షులు బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజాసమస్యలు పరిష్కరించాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో సాల్మన్‌రాజ్

వంగర: గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో సాల్మన్‌రాజ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన.. ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు మెరుగుపరచాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామీణులు వాటి బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

‘వెలుగు’లో ఆడిట్ రేపు

వంగర: స్థానిక వెలుగు కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఏపీఎం మీసాల చక్రపాణి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామైక్య సంఘాల పరిధిలోని రికార్డులను సిద్ధం చేయాలని వీవోఏలకు సూచించారు. పూర్తిస్థాయి రికార్డులతో సిబ్బంది కార్యాలయానికి హాజరు కావాలన్నారు.

10 మద్యంసీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్ఈబీ సీఐ శ్రీధర్

రాజాం సిటీ: మండలంలోని అమరాం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 10 మద్యంసీసాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడులు చేసి, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఇసుకను సీజ్ చేసి, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌ను అప్పగించామన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



కాలువల్లోని పూడికలు తీయిస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సర్పంచ్ బోడెల విజయబాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ఎం.ఎ.స్వామి పర్యవేక్షణలో మంగళవారం కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, చెత్తాచెదారం తొలగించారు. రానున్న వర్షాకాలంలో వర్షపునీరు వీధి కాలువల్లో నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామస్తులు కూడా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ఆమదాలవలసలో పూజలు చేస్తున్న మహిళలు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసం పురస్కరించుకుని, ఆలయ పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో షష్టిపూజలు నిర్వహించారు. కొత్తగా పెళ్లయిన పెండ్లికుమార్తెలు ఎక్కువగా ఈ పూజల్లో పాల్గొనడం విశేషం.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి



మార్కెట్‌ను సందర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: స్థానిక మార్కెట్‌లోని మేదరిబంద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మెయిన్ గేటు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక పట్టణంలోని పలు ప్రాంతాలను ఆమె మంగళవారం సందర్శించి, అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్రతీ వార్డు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రజలకు ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆమె వెంట ఆర్వో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.